క్లుప్తంగా

విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం స్థలం పరిశీలన


స్థలం పరిశీలిస్తున్న ఏఈ మల్లేశ్

లింగాపూర్: మండల కేంద్రంలో విద్యుత్ సబ్ స్టేషన్ కోసం సోమవారం విద్యుత్ శాఖ అధికారులు స్థలం పరిశీలించారు. ఏఈ మల్లేశ్, రెవెన్యూ ఆర్ఐ ప్రదీప్, గ్రామ నాయకులు బలిరామ్, కిరణ్ నాయక్, వినోద్, ఈశ్వర్‌లు లింగాపూర్ శివారులో స్థలం పరిశీలించారు.

నేడు అవగాహన సదస్సు

పెంచికల్‌పేట్: మండలంలోని మురళీగూడ గ్రామంలో నిరాక్షరాస్యులైన ప్రజలకు 'అందరూ చదవాలి –అందరూ ఎదగాలి' అనే సంకల్పంతో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సుంద్రిళ్ల రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో బడిబాట, విద్యా ప్రాముఖ్యత, బాల్యవివాహాల నిరోధం, ఓటు హక్కు, వన్యప్రాణుల సంరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి యువకులు, మేధావులు, ఉద్యోగులు, మహిళలు పెద్దఎత్తున హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వాంకిడి: మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. మండల వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంతలో మజ్జిగ పంపిణీ

కౌటాల: కౌటాల వారసంతలో సోమవారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకులు పాల్వాయి సుధాకర్‌రావు మాట్లాడుతూ జిల్లాలో ఎండలు మండుతున్నాయని, ప్రజలు వేడి నుంచి ఉపశమనం పొందడానికి మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వేసవికాలం ముగిసే వరకు ప్రతీ సోమవారం కౌటాలలో మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కుంచాల విజయ్, నాయకులు బూర్ల రవి, తిరుపతి, అశోక్, సత్తన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నాగంపేట, కొత్తసార్సాల, రాస్పెల్లి, వల్లకొండ, ఈజ్‌గాం గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను సోమవారం ఎంపీడీవో కోటప్రసాద్ పరిశీలించారు. నాగంపేటలో నిర్మిస్తున్న ఫారంపాండ్ పనులను పరిశీలించారు. నర్సరీలను పరిశీలించి వంద శాతం మొక్కలు ఉండేవిధంగా చూసుకోవాలని, జీవామృతం తయారు చేసి మొక్కల ఎదుగుదలకు వాడాలని సూచించారు. ఏపీవో చంద్రశేఖర్, గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రం ప్రారంభిస్తున్న సభ్యులు

ఆసిఫాబాద్అర్బన్: వేసవి దృష్టిలో పెట్టుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న టీం సభ్యులు చలివేంద్రాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల నుంచి తట్టుకునేందుకు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు వేడి నుంచి ఉపశమనం పొందేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీం జిల్లా అధ్యక్షుడు నగేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులు జాన్‌పాల్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఈడీ ఆపరేటర్ల నిరసన

రెబ్బెన(ఆసిఫాబాద్): ఖైరిగూడ ఓసీపీ మొదటి షిఫ్టులో మేనేజర్ శంకర్ చేసిన వ్యాఖ్యలకు గాను ఈపీ ఆపరేటర్లు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. విధులకు వెళ్లకుండా ఆపరేటర్లు రెస్ట్ హాల్‌లో ఖాళీగా కూర్చుంటున్నారని రెస్ట్ హాల్‌ను కూల్చేస్తామంటూ మేనేజర్ దురుసుగా మాట్లాడారు. ఆగ్రహించిన వారు కొద్దిసేపు విధులకు వెళ్లకుండా నిరసన తెలిపారు. ఈ విషయాన్ని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నేతల దృష్టికి తీసుకెళ్లగా వారితో మాట్లాడి సముదాయించారు. ఈ విషయమై మేనేజర్‌ను వివరణ కోరగా విధులకు హాజరుకావాలని చెప్పామే తప్పా ఎలాంటి దుర్భాషలాడలేదని తెలిపారు. ఓసీపీల్లో ఈపీ ఆపరేటర్ల పాత్ర ఎంతో కీలకమని, వారితో సామరస్యపూర్వకంగానే ఉంటామన్నారు.

అభివృద్ధికి నోచని తిర్యాణి

- గ్రామాలకు రహదారులు కరువు
- పర్యాటకంగా అభివృద్ధికి అవకాశం
- కానరాని అధికారుల పట్టింపు


తాత్కాలికంగా షెడ్డులో కొనసాగుతున్న గుండాల గ్రామపంచాయతీ కార్యాలయం


నాయకపుగూడ నుంచి దుగ్గాపూర్ గ్రామానికి వెళ్లే దారిలో ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి

తిర్యాణి: జిల్లాలోనే అత్యంత వెనుకబడిన తిర్యాణి మండలం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటుంది. ఏజెన్సీ మండలాన్ని అభివృద్ధి చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మండలం అభివృద్ధి కోసం సింగరేణి సంస్థ నుంచి డీఎంఎఫ్‌టీ(డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్)తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి భారీగా నిధులు మంజూరవుతున్నా క్షేత్రస్థాయిలో వీటిని సక్రమంగా వినియోగించకపోవడంతో మండలం అభివృద్ధి చెందడం లేదు. మండలంలో 29 గ్రామపంచాయతీలు ఉండగా 134 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. ఇందులో 25వేలకు పైగా జనాభా నివసిస్తుండగా 90శాతం జనాభాకు పైగా ఆదివాసీలే ఉన్నారు.

పర్యాటకంపై కానరాని దృష్టి..

మండలంలో చింతలమాదర, గుండాల (బహుబలి), ఉల్లిపిట్ట అనే మూడు అందమైన జలపాతాలు ఉండగా వీటిని చూసేందుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌తో పాటు మహారాష్ట్ర నుంచి సైతం అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. కానీ పర్యాటకుల కోసం జలపాతాల వద్ద సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించడం ద్వారా ప్రత్యక్షంగా స్థానికులకు పరోక్షంగా మండల వాసులకు ఉపాధి కలుగుతుంది. కాగా మండలంలోని మెజార్టీ గ్రామాల్లో నేటికీ ఎలాంటి మొబైల్ నెట్‌వర్క్ అందుబాటులో లేకపోవడంతో సమాచార మార్పిడితో పాటు ఆన్‌లైన్ ద్వారా అందించే పింఛన్ వంటి ప్రభుత్వ పథకాలు పొందేందుకు లబ్ధిదారులు అష్టకష్టాలు పడుతున్నారు. సిగ్నల్స్ సమస్య పరిష్కారానికి బీఎస్ఎన్ఎల్ సంస్థ మండలంలో ఇప్పటికే 16 సెల్‌ఫోన్ సిగ్నల్ టవర్ల నిర్మాణం చేపట్టింది. కానీ వాటిని ప్రారంభించకపోవడంతో అవి అలంకారప్రాయంగా మారాయి. మండలంలో ఉన్న సమస్యలను పరిష్కరించి అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

పర్యాటకంగా అభివృద్ధి చేయాలి



పర్యాటకులను ఆకట్టుకునే ఎన్నో ప్రకృతి అందాలకు నిలయమైన తిర్యాణి మండలాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలి. తద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయి. మండల కేంద్రం నుంచి అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి. డీఎంఎఫ్‌టీ నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా ఖర్చు చేయాలి.

– తోడసం భాస్కర్, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు

అసంపూర్తి పనులు.. కానరాని రోడ్లు..

మండల కేంద్రం నుంచి దాదాపు 50శాతం గ్రామాలకు వెళ్లేందుకు కనీస రోడ్డు సౌకర్యం లేదు. దీంతో వర్షాకాలం వచ్చిందంటే గుండాల, మంగి, కొటగాం, గీసిగూడ, గోపెర, భీంరెల్ల, బుగ్గరామన్న గూడెం, తాటిగూడ, గోవెన, నాయకపుగూడ, కుర్సిగూడ గ్రామాల ప్రజలకు కాలినడకనే శరణ్యమవుతుంది. చాలా గ్రామాలకు మధ్యలో ఉండే వాగుల వద్ద వంతెనలు నిర్మించకపోవడంతో వాగులు ఉప్పొంగిన సమయంలో బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. అంతేకాక మండల కేంద్రం నుంచి శ్రీ ఇన్ క్లైయిన్ వెళ్లే రహదారి గుంతలమయంగా మారడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారుతుంది. ఏళ్లుగా చిన్న మరమ్మతులు చేస్తున్నారే తప్పా నూతన రోడ్డు నిర్మాణం చేపట్టడం లేదు. గోవెన పంచాయతీ పరిధిలోని నాయకపుగూడ గ్రామానికి నేటికీ విద్యుత్ సరఫరా లేకపోవడం మండలం వెనుకబడిన తీరుకు అద్దం పడుతుంది. నూతనంగా ఏర్పాటు చేసిన పంచాయతీలకు నేటికీ సరైన భవన నిర్మాణం చేపట్టలేదు. నాయకపుగూడ గ్రామం నుంచి దుగ్గపూర్ గ్రామంపై ఉన్న వాగుపై గత మూడేళ్ల క్రితం నిర్మించ తలపెట్టిన వంతెన నేటికీ అసంపూర్తిగా దర్శనమిస్తుంది. మండల కేంద్రంలో ప్రతీ శుక్రవారం నిర్వహించే వారసంతను ప్రైవేట్ వ్యక్తులు నిర్వహిస్తుండగా అటు పంచాయతీ ఆదాయం కోల్పోవడంతో పాటు ఇటు అమ్మకందారులు, కొనుగోలు దారులు సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మహిళా ఉద్యోగులు అన్ని రంగాల్లో రాణించాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న జీఎం విజయ భాస్కర్‌రెడ్డి

రెబ్బెన: సింగరేణి సంస్థలో బొగ్గు ఉత్పత్తిలో పాలుపంచుకుంటున్న మహిళా ఉద్యోగులు అన్ని రంగాల్లోనూ రాణించేందుకు కృషి చేయాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. 139వ మేడే సందర్భంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏరియాలోని మహిళా ఉద్యోగులకు పలు క్రీడాపోటీలు నిర్వహించారు. సోమవారం ఉదయం గోలేటి సీహెచ్‌పీలో, సాయంత్రం జీఎం కార్యాలయంలో మహిళా ఉద్యోగులకు పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన ఉద్యోగులకు జీఎం చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. జీఎం మాట్లాడుతూ కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి అనేక హక్కులు సాధించుకున్నారన్నారు. పోరాటాల్లో ఎంతో మంది కార్మికులు అసువులు బాసారని వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ మేడే వేడుకలను ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. మేడే పురస్కరించుకుని మొదటిసారిగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మహిళా ఉద్యోగులు వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధికారుల సంఘం ఏరియా కార్యదర్శి వీరన్న, ఎస్ఓటూజీఎం రాజమల్లు, సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు రాజేశ్, కిరణ్, ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, నాయకులు అంజయ్య, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


బోరు వేయిస్తున్న సీఐ శ్రీనివాస్

పెంచికల్‌పేట్: పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కాగజ్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కోయచిచ్చాల గ్రామంలో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు సీఐ దృష్టికి తీసుకురాగా ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం బోరు వేయించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు కోసం పోలీసులు పనిచేస్తారన్నారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే నేరుగా పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సమాజ అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. ఆయన వెంట ఎస్సైలు కొమురయ్య, సందీప్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

'వాటర్ క్యూరింగ్ చేయాలి'


వాటర్ క్యూరింగ్‌కు నోచుకోని సీసీరోడ్డు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని సాలేగూడ గ్రామంలో నూతనంగా సీసీ రోడ్డు నిర్మించారు. రోడ్డు వేసి ఐదు రోజులు గడుస్తున్నా నేటి వరకు కాంట్రాక్టర్ సీసీరోడ్డుకు వాటర్ క్యూరింగ్ చేయడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని వాటర్ క్యూరింగ్ చేయించాలని కోరుతున్నారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన రోడ్డుకు వాటర్ క్యూరింగ్ చేయకపోతే రోడ్డుకు త్వరగా బీటలు పడుతాయని పేర్కొంటున్నారు.

ఎల్కపల్లి బస్టాండ్ నుంచి బస్సు నడపాలి


ట్రాక్టర్‌తో రోడ్డుకిరువైపులా మొరంతో చదును చేస్తున్న సిబ్బంది

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని సీసీరోడ్డు నిర్మాణ పనులు పూర్తయిన నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసులను వయా ఎల్కపల్లి బస్టాండ్ నుంచి కొనసాగించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. గత ఇరవై రోజులుగా రోడ్డు నిర్మాణ పనులు కొనసాగిన నేపథ్యంలో బస్టాండ్ మీదుగా బస్సు సేవలు నిలిచిపోయాయి. ఈవిషయంపైన ఆసిఫాబాద్ డిపో మేనేజర్‌ను సంప్రదించగా సర్వీసులను మంగళవారం నుంచి బస్టాండ్ మీదుగా మళ్లీస్తామని తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ, నాయకులు

దహెగాం: తెలంగాణ ప్రజాప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి 2025 చట్టం అమలు చేయడంపై మండల కాంగ్రెస్ పార్టీ, రైతుల ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భూభారతి చట్టం ఏప్రిల్ 14న ప్రారంభించారన్నారు. ఈ చట్టం ద్వారా భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీచైర్మన్ సిడాం గణపతి, మాజీ జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కలు సంరక్షించాలి


మొక్కలు పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేశ్

కౌటాల: నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని ఎంపీడీవో రమేశ్ అన్నారు. సోమవారం మండలంలోని ముత్తంపేటలోని నర్సరీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల్లోని మొక్కలను ఎండిపోకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని, నర్సరీల్లో అన్ని రకాల మొక్కలు పెంచాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హులైన వారిని ఎంపిక చేయాలన్నారు. గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న విశ్వప్రసాద్

వాంకిడి: మండల కేంద్రంలోని ఇంద్రానగర్‌లో ఉపాధిహామీ నిధుల నుంచి రూ.5 లక్షలతో మంజూరైన సీసీరోడ్డు నిర్మాణ పనులను డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివకుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ, యూత్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్, నాయకులు గణేశ్, అనిల్, నాగభూషణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రాస్తారోకో చేసిన వారిపై కేసు నమోదు

రెబ్బెన: జిల్లాలో 30 పోలీస్‌యాక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా రాస్తారోకో చేపట్టి ప్రజలకు ఇబ్బంది కలిగించిన వ్యక్తులపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 25న మండలంలోని గోలేటికి వెళ్లే దారిలో ఏఐటీయూసీ నాయకులు బోగే ఉపేందర్‌తో పాటు మరి కొంతమంది లారీ డ్రైవర్లతో కలిసి రాస్తారోకో చేపట్టారు. దీంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో 30 పోలీస్‌యాక్ట్ అమలులో ఉన్నందున ఎలాంటి అనుమతులు లేకుండా రాస్తారోకో చేసి ప్రజలకు ఇబ్బంది కలిగించిన బోగే ఉపేందర్, అరికెల్ల స్వామి, బర్దాల తిరుపతి, సులవ సతీశ్, అయిల్లా ప్రశాంత్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాఫిక్ తిప్పలు..!

- రోడ్డుపైనే దుకాణాలు, అక్కడే వాహనాల పార్కింగ్
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- రోడ్లు విస్తరించాలని వేడుకోలు


కౌటాలలో సోమవారం ఏర్పడిన ట్రాఫిక్‌జామ్

కౌటాల: జిల్లాలో కౌటాల మండల కేంద్రం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. కౌటాలలో గత పదేళ్లుగా జనసంచారం క్రమంగా పెరుగుతోంది. వాహనాల వినియోగం సైతం పెరిగింది. కౌటాలతో పాటు చింతలమానెపల్లి, సిర్పూర్(టి), బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాల్లో విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రైవేట్ ఉద్యోగులు, పలువురు వ్యాపారులు కౌటాలలోనే ఇళ్లను అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఈక్రమంలో మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది.

పెరిగిన వాహనాల రద్దీ..

కౌటాలలోని ఇరుకురోడ్లతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సోమవారం వారసంతలో కంకర లారీల కారణంగా అరగంట పాటు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రామాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులకు తిప్పలు తప్పలేదు. ప్రతీ సోమవారం కౌటాలలో నిర్వహించే వారసంతకు వేలాదిగా వ్యాపారులు, వినియోగదారులు వస్తుంటారు. వారసంత రోజు కౌటాల –బెజ్జూర్ ప్రధాన రోడ్డుకు ఇరువైపుల దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. రోడ్డుపైనే ద్విచక్ర వాహనాలను నిలిపేస్తున్నారు. కంకర టిప్పర్ లారీలు నడుస్తుండడంతో మార్కెట్ ఏరియాలో ట్రాఫిక్ జామ్ అవుతుంది. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి అంబులెన్స్ రావాలంటే రద్దీలో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంటుంది. మండల కేంద్రంలోని మార్కెట్ ఏరియా, కుమురం భీం చౌరస్తా, మొగడ్‌దగడ్ చౌరస్తా, తలోడి చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. కౌటాలలో జిన్నింగ్ మిల్లు ఉండడంతో సమీప మండలాల నుంచి వందల పత్తి వాహనాలు కౌటాలకు వస్తుండడంతో కౌటాలలో సమస్య మరింత పెరుగుతుంది. దీంతో వాహనచోదకులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు.

రోడ్డు విస్తరణతో..

కౌటాల ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించి కౌటాల మినీ స్టేడియం నుంచి తలోడి దసలి పట్టు పరిశ్రమ వరకు రోడ్డు విస్తరణ చేపట్టాలని, డివైడర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు సెంట్రింగ్ లైట్లు ఏర్పాటు చేయాలని పలువురు పేర్కొంటున్నారు. మండల కేంద్రంలోని మొగడ్‌దగడ్, విజయనగరం, తలోడి రోడ్లను డబుల్ రోడ్డుగా మార్చాల్సి ఉంది. మండల కేంద్రం తాటిపల్లి చౌరస్తా నుంచి దసలి పట్టు పరిశ్రమ వరకు.. కుమురం భీం చౌరస్తా నుంచి కోయగూడ నజరేత్ పాఠశాల వరకు.. తలోడి చౌరస్తా నుంచి నాగేపల్లి చౌరస్తా వరకు.. మొగడ్‌దగడ్ చౌరస్తా నుంచి హెచ్‌పీ పెట్రోల్ పంపు వరకు మండల కేంద్రం విస్తరించింది. ఆయా ప్రాంతాల వరకు రోడ్డు విస్తరణ చేపడితే ట్రాఫిక్ సమస్య ఉండదని మండలవాసులు పేర్కొంటున్నారు.

ఇరుకు రోడ్లతో సమస్య..

జిల్లాలోనే ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల తర్వాత కౌటాలలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. కానీ కౌటాలలోని మొగడ్‌దగడ్ రోడ్డు, విజయనగరం రోడ్డు ఇరుకుగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలోని కోయగూడ వరకు పెద్ద భవనాలు నిర్మించారు. తలోడి గ్రామం, శివలింగపూర్ గ్రామాల వరకు ఇళ్లు నిర్మించారు. దీంతో వాహనాల రాకపోకలు పెరిగాయి. మొగడ్‌దగడ్ రోడ్డు సమీపంలో జిన్నింగ్ మిల్లు, రైస్ మిల్లులు ఉండడంతో భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కౌటాల ప్రభుత్వ పాత ఆరోగ్య కేంద్రం ఎదుట, కౌటాల –బెజ్జూర్ ప్రధాన రహదారికి ఇరువైపులా ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా అక్రమంగా టేలలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఇదే అదునుగా కొందరు పంచాయతీ స్థలాల్లోనూ గదులు నిర్మించి అద్దెకు ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కౌటాలలో పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం లేకపోవడంతో రోడ్డుకు అనుకొని ఉన్న టేలాల ఎదుటే వాహనాలు నిలుపుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

దరఖాస్తుల పరిశీలన


దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్అర్బన్: నిరుద్యోగులకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకానికి ఈనెల 14వ తేదీలోగా దరఖాస్తులు చేసుకున్న వారి ధ్రువపత్రాలను సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధి కారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఇందులో ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్‌ల కింద ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న గ్రామపంచాయతీలు గోవింద్‌పూర్, అడదస్నాపూర్, వా వుదం, వెంకటాపూర్ లబ్ధిదారుల దరఖాస్తుల ను పరిశీలించారు. ఈ పరిశీలన కార్యక్రమం రాజీవ్ యువ వికాసం కమిటీ సభ్యులు, అధి కారులు దరఖాస్తులు పరిశీలించినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి

కాగజ్‌నగర్‌రూరల్: మేడే స్ఫూర్తితో లేబర్ కోడ్‌ల రద్దు కోసం మే 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు పిలుపునిచ్చారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో సోమవారం సీఐటీయూ అనుబంధ సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మేడే స్ఫూర్తితో 18 గంటల పని విధానం నుంచి 8 గంటలకు కార్మికులు పోరాడి సాధించుకున్న చరిత్ర ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రం ప్రైవేటీకరణ చేస్తూ మరోవైపు ధరలు విపరీతంగా పెంచి పేద ప్రజలపై భారం వేస్తుందని ఆరోపించారు. జిల్లాలోని సంఘటిత, అసంఘటిత, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులందరూ సమ్మెకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్, నాయకులు గౌస్, సంజీవ్, మాట్ల రాజు, సమ్మయ్య, మురళి, నగేశ్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.సాయికుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899